J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 20 17.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### టగ్ ఆఫ్ వార్

# బిహార్..గేమ్ ఛేంజర్

- బిహార్ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ
- అధికార పక్షానికి సవాల్ • ప్రతిపక్షానికి జీవన్మరణం

ఇది మోడీ సచ్ఛీలతకీ, రాహుల్ ఓట్ చోరీ ఆరోపణల్లోని వాస్తవికతకి.. అసలు సిసలైన పరీక్ష. రెండు ప్రధాన జాతీయ పార్టీల బల ప్రదర్శనకి, మరో రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీల ఉనికికి తార్కాణంగా నిలిచే సమరం. ఎన్నికల కమిషన్ పారదర్శకతను ప్రపంచానికి చాటే రాజకీయ పోటీ. అవును, ఈ ఏడాది నవంబర్ *6, 11* తేదీల్లో జరగనున్న బిహార్ ఎన్నికలు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే దశ-దిశను సూచించనున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో ఓటరు దేవుళ్ళు ఎవరిని కరుణిస్తారో ఎవరిని తరిమేస్తారో త్వరలోనే తేలిపోనుంది.

2లో






## మల్లన్న సేవలో 'త్రిమూర్తులు'

అక్టోబర్ 16, గురువారం నాడు శ్రీశైలంలోని మల్లన్నను దర్శించుకున్న భారత ప్రధాని నరేంద్రమోడీ, ఇరువైపులా ఆంధ్రా సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



## చంద్రబాబు దార్శనికతకు దర్పణం విశాఖలో గూగుల్

'మనసులో మాట'.. 9లో




# అవినీతిపై.. తెరచిన 'మూడో కన్ను'!

## ఆర్ఎం భాస్కర్‌బాబు కవితాసంపుటి ఆవిష్కరణ

## పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్, శ్రీసిటీ ఎం.డీ



సూళ్ళూరుపేట పట్టణ పరిధిలోని మన్నారుపోలూరు గ్రామానికి చెందిన ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి పూర్వ విలేకరి ఆర్ఎం భాస్కర్‌బాబు రచించిన 'మూడో కన్ను' కవితా సంపుటిని ఇటీవల ఆ గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భాస్కర్ రచించిన ఆ కవిత సంపుటిలో 'వృత్తి ధర్మం' అనే కవిత తన నెంతో ప్రభావితం చేసిందన్నారు. 'అవినీతి పరుల బతుకు చీకటిగానే ఉంటుందని, ఆత్మవిశ్వాసంతో తలెత్తుకుని జీవించేది నీతిమంతులకే సొంతమని' చెప్పడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. 'నిజాయితీకి నిదర్శనంగా ఉండు.. అవినీతితో కుళ్లిపోకు' అంటూ వృత్తిధర్మంలో ఎంత నిజాయితీగా ఉండాలో భాస్కర్ తన కవితలో అద్భుతంగా వివరించాడని ఆయన కొనియాడారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కవితలు అందరూ చదవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, భాస్కర్ కుటుంబంతో తనకు ఎంతోకాలంగా సాన్నిహిత్యం ఉందని, ఆయన రచించిన కవితలు అందరినీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయని అన్నారు. జర్నలిస్టుగా పనిచేసిన వ్యక్తి కవితా రంగంలోకి రావడం గొప్ప విషయమని ఆయన అభినందించారు. వాస్తవానికి తమ జీవితాలు తొలినుంచీ సంతోషంగా సాగలేదని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఎంతో కష్టపడితేనే నేడు తమకు ఈ ఉన్నత స్థాయి వచ్చిందని ఆయన గుర్తు చేసుకుంటూ, విద్యార్థులంతా ఇలాంటి పుస్తకాలు చదువుకుని సమాజంలో ఉన్నత శిఖరాలందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం 'మూడోకన్ను' కవితా సంపుటి రచయిత భాస్కర్‌బాబు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన భాస్కర్‌బాబు సోదరుడు, ప్రముఖ రచయిత-పాత్రికేయుడు ఆర్ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, తమ బంధువులు, కుటుంబం తరపున మన్నారుపోలూరు హైస్కూల్‌లో చదువుకుంటూ, 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురికి ప్రతి ఏటా 'కళాచిత్ర' జ్ఞాపికలతో పాటు, ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామని, అందుకోసం 10లక్షల రూపాయలను బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఉత్తమ ప్రతిభతో రాణించిన ముగ్గురు విద్యార్థులకి జిల్లా కలెక్టర్, శ్రీసిటీ ఎం.డీల చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. సూళ్ళూరు పేట ఆర్డీఓ కిరణ్మయి, తహశీల్దార్ గోపీ నాథ్, ఎంఇఓ సునీల్ కుమారి పాల్గొన్నారు.

## వైద్యకళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలకు నిరసనగా..

# వైసీపీ సంతకాల సేకరణ



ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. వైసీపీ ఆధ్వర్యంలో నెల్లూరు నగర నియోజకవర్గంలో ఇటీవల కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైసీపీ నాయకుడు..ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతి రేకిస్తూ.. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సంతకాల సేకరణ ప్రారంభించారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నెల్లూరు నగర నియోజకవర్గంలో 60వేల నుంచి.. లక్ష సంతకాల వరకు సేకరిస్తామని తెలిపారు.. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తిచేసి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌కి పంపి.. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చూస్తారన్నారు. అప్పటికీ ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే.. న్యాయస్థానాల ద్వారా న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిహార్..గేమ్ ఛేంజర్

(మొదటిపేజీ తరువాయి)

ఆకర్షించే మేనిఫెస్టోలు, ఎత్తుకు పైఎత్తులు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు బిహార్ ఎన్నిక కేంద్రబిందువు. దేశ ప్రధాని నుంచి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడి వరకు, అంతా లీనమై, అన్నీతామై నడిపిస్తున్న రసవత్తర ఎన్నిక ఇది. తేడావస్తే, భవిష్యత్ అగమ్యగోచరమే అనే స్థాయిలో చేస్తున్న రాజకీయ యుద్ధం. గెలిస్తే.. ఓకే, లేకుంటే భవిష్యత్ శూన్యం అనేలా చావో రేవో తేల్చుకోవడానికి సిద్ధమైన ప్రాంతీయ పక్షాలతో, రోజుకో కొత్త లక్ష్యం, పూటకో వాగ్దానం, గడియకో హామీ అన్నట్లుగా సాగిపోతోంది బిహార్ ఎన్నికల సమరం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తూ, ఎన్నికల కమిషన్‌ను చేతిలో పెట్టుకుని ఓట్ చోరీకి పాల్పడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కారాలు మిరియాలు నూరేస్తున్నారు.

ఈ క్రమంలో ఎప్పుడూ లేనంత స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘాన్నే టార్గెట్ చేస్తున్నాడు. ఏకంగా 65లక్షల మంది ఓటర్లను అడ్డగోలుగా తొలగించి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకి ఈసీ వంతపాడుతోందని, వారి గెలుపునకు ప్రత్యక్షంగా సాయం చేస్తోందని ఆయన ఆరోపిస్తున్నాడు. ఇందుకోసం ఏ రాష్ట్రంలో చేయని విధంగా "ఓట్ చోరీ" పేరిట 1,300 కిలో మీటర్ల యాత్ర చేస్తూ దూసుకెళ్తున్నారు. తమకు వ్యతిరేక వర్గాలకు చెందిన ప్రజల ఓట్లను తొలగిస్తూ, ఈవీఎంలతో మేనేజ్ చేస్తూ, మోడీ మరో రాష్ట్రంలో ఎన్నికలను తన ఖాతాలో వేసుకునేందుకు సిద్ధమైపోతున్నారని, దాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత బిహారీయులదేనని రాహుల్ గళమెత్తుతున్నారు. తన పథంలో పదం కలిపి కదం తొక్కుతూ యాత్రలో తనవెంట నడవాలని, తద్వారా బీజేపీకి, నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూకి చెక్ చెప్పాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు.

### నాడు చరిత్ర ఘనం.. మరి నేడు..?

బిహార్... ఈ రాష్ట్రానికి దేశంలోనే ప్రత్యేక స్థానముంది. పూర్వకాలంలో యావత్ దేశాన్ని పాలించిన అశోకుడు, ఆ తర్వాత పాలించిన మౌర్య వంశ ప్రతిష్టకు కేంద్ర బిందువు ఈ రాష్ట్రం. దీని రాజధాని నేటి పాట్నా (నాటి పాటలీపుత్రం) వేల సంవత్సరాల క్రితమే ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. బుద్ధ భగవానుడి బౌద్ధ మతానికి జీవం పోసిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. భారత దేశం బ్రిటీష్ వారి నుంచి విముక్తి పొందిన తర్వాత, ఈ రాష్ట్రంలో మొత్తం 333 అసెంబ్లీ స్థానాలుండేవి. ఆ తరువాత జార్ఖండ్ రాష్ట్రం ఏర్పడడంతో ఆ సంఖ్య 243 సీట్లకు పరిమితమైంది. ఎందరో రాజకీయ ఉద్దండులను ఈ రాష్ట్రం దేశానికి అందించింది. ఇదే క్రమంలో పాలకుల దాష్టీకాలకు బలై, అభివృద్ధికి ఆమడదూరంలో ఆగిపోయింది. అత్యంత తక్కువ అక్షరాస్యతతో, దేశానికి కార్మికులను, కూలీలను సరఫరా చేసే ప్రాంతంగా మారిపోయింది. అయితే, జాతీయ పార్టీల రాజకీయ అవసరాలు, ప్రాంతీయ పార్టీలకు చెందిన నేతల మనుగడ అనే అంశాలు ఈ రాష్ట్రంలో ప్రస్తుతం కొద్దోగొప్పో సంస్కరణలకు బీజం వేస్తున్నాయి. దీంతో ఓటర్లలో సైతం కొంతమేర మార్పు కనిపిస్తోంది.

### మిత్రపక్షం కోసం కాలికి బలపం కట్టుకుని!

బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలకు గాను, కాంగ్రెస్‌పార్టీకి ఉన్నవి కేవలం 19 సీట్లే. ఈసారి ఓ పాతిక స్థానాలకు చేరితే గొప్పే. వాటితో రాష్ట్ర రాజకీయలను శాసించడం కుదరనిపనే. ఈ విషయం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలియనిది కాదు. అయితే, ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ఉనికి కోల్పోయి, ఆఖరికి మిత్రపక్షాలు సైతం ముఖం చాటేసే పరిస్థితి రావడంతో బిహార్‌లో ఎలాగైనా తమ సత్తాచాటి ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారాలని రాహుల్ ఆశపడుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మహాఘట్ బంధన్‌లో భాగమైన జేడీయూ అధినేత నితీశ్, దుస్తులు మార్చినంత సులభంగా కూటములు మార్చేస్తుండడంతో తమ పక్షాన సుదీర్ఘకాలంగా ఉన్న లాలూ ప్రసాద్, తేజస్వీయాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీకి వెన్నుదన్నుగా ఉండాలని రాహుల్ భావిస్తున్నాడు. గతంలో 77 సీట్లతో సత్తాచాటిన ఆర్జేడీ ఈసారి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన స్థాయిలో సీట్లను దక్కించుకుంటుందని అంచనా వేస్తున్నాడు. వేడినీళ్లకు చల్లనీళ్లలా వారికి తోడుగా ఉండి సీట్ల సంఖ్యను, ఎంతోకొంత బలాన్ని పెంచుకోవాలని రాహుల్ వ్యూహాలు రచిస్తున్నాడు. అందుకే తమ పార్టీకి పెద్దగా ప్రయోజనం ఉండదని తెలిసినా, మిత్రుడి కోసం కాలికి బలపం కట్టుకుని వందల కిలోమీటర్లు యాత్రలు చేస్తూ రాహుల్‌గాంధీ ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.

ఇక ఇప్పటికే కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆర్జేడీ నేతలు లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ లైఫ్ అండ్ డెత్ అన్నట్లుగా ప్రజాక్షేత్రంలో గెలుపు బావుటా ఎగురవేసేందుకు ఆరాటపడుతూ పోరాడుతున్నారు.

### అస్త్రశస్త్రాలతో కమలం దూకుడు!

ఓవైపు జీఎస్టీ సంస్కరణలు, భారీగా ఉచిత హామీలు, ప్రత్యేక ప్యాకేజీలని ప్రకటిస్తూ, మరోవైపు వందలకోట్ల కేంద్ర ప్రాజెక్టులను బిహార్‌కు కేటాయిస్తూ మోడీ, అమిత్‌షా, నడ్డా సారథ్యంలోని బీజేపీ ఎన్నికల రణరంగంలో దూసుకెళ్తోంది. దీనికితోడు బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భారీగా ఉద్యోగ నోటిఫికేషన్లతో పాటు లెక్కకి మించి వరాలు ప్రకటిస్తూ ప్రస్తుత సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో బిహార్‌లో ఎన్డీయే గెలుపు నల్లేరుపై నడకే అన్న ప్రచారం జోరందుకుంటోంది. అయితే, విశ్వసనీయత అనే పదాన్ని పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా కూటములను మారుస్తూ కేవలం క్లీన్ ఇమేజ్ పేరుతో గత మూడు దశాబ్దాలుగా సీఎం కుర్చీని కాపాడుకుంటున్న నితీశ్‌కుమార్‌ను ఈసారి బిహార్ ప్రజలు ఎంతవరకు నమ్ముతారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈసారి ఎన్నికల్లో యువతరం కీలక పాత్ర పోషించే అవకాశం ఉండడంతో వారంతా కాలం చెల్లిన నితీశ్‌ను కాకుండా యువనేత తేజస్వీకే పట్టం కట్టే అవకాశం కనిపిస్తోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇక గత ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా ఏకంగా 80 స్థానాలను సొంతం చేసుకున్నా, సీఎం సీటును చేజిక్కించుకోలేకపోయాం, అనే బాధ బిహార్ బీజేపీ నాయకులతో పాటు కేంద్రంలో త్రిమూర్తులైన మోడీ, అమిత్‌షా, నడ్డాకి కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా కనీసం 100 సీట్లను సొంతంగా చేజిక్కించుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని కొట్టేయాలని కమలం పార్టీ నేతలు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఈ మేరకు మోడీ, అమిత్‌షా పూర్తిస్థాయిలో ప్రణాళిక సిద్ధంచేసి, ఎన్నికల సంగ్రామాన్ని ముందుకు నడిపిస్తున్నారనే విశ్లేషణలు పుట్టుకొస్తున్నాయి. ఎటొచ్చి నితీశ్, తేజస్వీ స్థాయి ఉన్న నాయకుడు బిహార్ బీజేపీలో లేకపోవడమే కమలం పార్టీకి ఉన్న పెద్ద మైనస్‌గా కనిపిస్తోంది. అయితే, సర్వాంతర్యామి మోడీ నామస్మరణే తమకు శ్రీరామ రక్ష అని ఆ పార్టీ భావిస్తోంది. ఇక తన చతురతతో అనేక పార్టీలు గెలుపు గుర్రం ఎక్కేందుకు తోడ్పడిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఈసారి సొంత పార్టీ జనసురాజ్‌తో బిహార్ బరిలో దిగుతుండడం ఆసక్తికరం. ఈయన ఏమేరకు ప్రభావం చూపిస్తారో కూడా చూడాల్సి ఉంది.

### ఆ రాష్ట్రాలకు రోడ్‌మ్యాప్!

బిహార్ ఎన్నికల తర్వాత బీజేపీకి దేశంలో అతిపెద్ద గుదిబండలుగా కనిపిస్తున్న కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 2026 ప్రారంభంలో ఎన్నికలు జరగనున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం పాలిస్తున్న పార్టీలు భారతీయ జనతా పార్టీకి బద్ధశత్రువులుగా వ్యవహరిస్తున్నాయి. కేరళలో పినరయ్ విజయన్ నేతృత్వంలోని కమ్యూనిస్టులు, తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ నరేంద్ర మోడీతో ఎప్పుడూ ఉప్పునిప్పు అన్న తరహాలో తలపడుతుంటాయి. ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికలు అటు ఎన్డీయే కూటమికి, ఇటు ప్రతిపక్ష ఇండియా కూటమికి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయనడంలో సందేహం లేదు. బిహార్ ఎన్నికల్లో వచ్చే ఫలితం, మిగిలిన మూడు రాష్ట్రాల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఖచ్చితంగా ఉంటుంది. ఇదే సమయంలో బీజేపీ అగ్రనేతల అడుగులకు మడుగులొత్తుతూ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వ హించేందుకు యత్నిస్తోందని విమర్శలెదుర్కొంటున్న ఈసీకి కూడా బిహార్ సమరం పెనుసవాలే. ఇలా ఏ విధంగా చూసినా భారత రాజకీయాల్లో బిహార్ ఎన్నికలు ఓ గేమ్‌ఛేంజర్ కావడం ఖాయంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు...!

## టెక్ ప్రపంచంలో..
# ఏపీ చరిత్రాత్మక అడుగు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం



టెక్ ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చరిత్రాత్మక అడుగులు వేసిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవలే రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ విశాఖపట్నం కేంద్రంగా వేలాదికోట్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగు పెట్టేలా అనుబంధ సంస్థ రైడన్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఆమేరకు ఒప్పందం చేసుకున్నారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు. గూగుల్ రాకతో ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తోందని విపిఆర్ అన్నారు. డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. నాడు హైదరాబాద్, నేడు విశాఖ అభివృద్ధి సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు.

## గూగుల్ రాక అద్భుతం - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

రాష్ట్రానికి గూగుల్ రాక అద్భుతమని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ప్రపంచం గర్వించదగ్గ సంస్థ గూగుల్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకే దక్కిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆ సంస్థ రాష్ట్రానికి రావడాన్ని దేశవ్యాప్తంగా అందరూ ప్రశంసిస్తుంటే.. వైసీపీ నాయకులు మాత్రం దానిని స్వాగతించకపోవడం విడ్డూరమన్నారు.



## గూగుల్‌పై జగన్ బ్యాచ్‌కి
# కడుపుమంట!

**- సోమిరెడ్డి ధ్వజం -**

రాష్ట్రానికి ప్రపంచవ్యాప్త పేరెన్నికగన్న గూగుల్ సంస్థ రావడం జగన్ బ్యాచ్ తట్టుకోలేకపోతుందని, అంతటి ప్రఖ్యాత సంస్థ రావడం వారికి కడుపుమంటగా ఉందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. విశాఖకు గూగూల్ రావడాన్ని వైసీపీ తప్ప అందరూ స్వాగతిస్తున్నారన్నారు. గూగుల్ టేకవుట్ టెక్నాలజీ ద్వారా వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిని సీబీఐ గుర్తించిందని, జగన్ రెడ్డి బ్యాచ్ గుట్టును రట్టు చేసిందని గూగుల్‌పై వారికి కోపంగా ఉన్నట్లుందన్నారు. రూ. 1.33లక్షల కోట్లతో గూగుల్ ఏపీకి రావడం గొప్ప విషయమన్నారు. మంత్రి లోకేష్‌బాబు కృషితోనే కొత్త రాష్ట్రమైన ఏపీ ఈ ఘనతను సాధించిందన్నారు. రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన సంస్థ వస్తుంటే వారి మీడియాలో ఒక్క వార్త లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంత కడుపుమంటతో రగిలిపోయే వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారని చెప్పుకోవాల్సివచ్చినందుకు ప్రజలు బాధపడుతున్నారని ఆయన విమర్శించారు. అటువంటి వ్యక్తి మళ్లీ సీఎం అవుతానని కలలు కనడం మరింత విచారకరమన్నారు.

# నగరంలో వినూత్నంగా..'స్మార్ట్ స్ట్రీట్'

**వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



నగరంలో వినూత్నమైన రీతిలో స్మార్ట్ స్ట్రీట్ ప్రారంభమైంది. నెల్లూరులోని మైపాడు గేట్ వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి ఇటీవల వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.7 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా ఈ దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 30 మాడ్యులర్ కంటైనర్లతో 120 దుకాణాలను ఏర్పాటుచేసి, వీధి వ్యాపారులకు స్థిర వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించింది. దీనిని ప్రారంభించిన అనంతరం సీఎం నేరుగా లబ్ధిదారులైన దుకాణదారులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రతి ఇంటా చిరు వ్యాపారమో, చిన్నపరిశ్రమో స్థాపించేలా పని చేస్తున్నామన్నారు. నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌లో దుకాణాలు పొందిన 120 మంది, 18 ఏళ్లకు పైగా వీధి వ్యాపారాలు చేసి ఇప్పుడు అత్యాధునిక దుకాణాలు పొంది వ్యాపారాలు చేసుకునే అవకాశం కలిగిందని ఆయన అన్నారు. గతంలో అపరిశుభ్రమైన పరిస్థితుల్లో వ్యాపారాలు చేసుకునే స్థితి నుంచి ఇప్పుడు అత్యాధునిక దుకాణాల ద్వారా వ్యాపారం చేసుకునే సౌలభ్యం కలిగిందని, కొనుగోలుదారులకు అన్ని వస్తువులూ ఒకే చోట లభించేలా ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ ప్రాంతం ఏర్పాటైందని చెప్పారు. ఈ వినూత్న ప్రయత్నం చేసిన మంత్రి నారాయణ, పురపాలక శాఖ, మెప్మా అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# కర్నాటి, కనుమూరులకి పదవులు





బీజేపీలో నెల్లూరుజిల్లాకి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు పదవులు లభించాయి. బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టుల్లో సీనియర్ బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డికి స్థానం లభించింది. ఈ స్థానాల్లో మొత్తం 19 మందిని నియమించగా, అందులో కర్నాటి ద్వితీయులు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ విషయాలు జాతీయ మీడియాతో మాట్లాడే ఆరుగురు ప్యానలిస్టుల్లో కనుమూరు రవిచంద్రారెడ్డి కూడా నియమితులయ్యారు. జిల్లాలో వీరు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం వారికి ఈ సముచిత పదవులు ఇవ్వడంతో బీజేపీ వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# కల్తీమద్యం గుర్తించే..కొత్త 'యాప్' - ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ వెల్లడి

నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ఉపయోగపడుతుందని, మద్యం విక్రయాలు జరిపేటప్పుడు తప్పనిసరిగా ఈ యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శంకరయ్య చెప్పారు. ఈనెల 15న నెల్లూరులోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన నగరంలోని బార్లు, మద్యం దుకాణాల యజమానులతో సమావేశమయ్యారు. స్కాన్ చేయకుండా మద్యం బాటిళ్ళను విక్రయించడం పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. దీనిద్వారా కల్తీమద్యం అమ్మకాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. ప్రజలు ఈ యాప్‌పై



అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ పి.రమేష్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.ప్రభాకరరావు, డి.శ్రీధర్, జె.కె.వి.ఎన్.మురళీకృష్ణ పాల్గొన్నారు.



లాయర్
అక్టోబర్ 17, 2025

# కొండెక్కిన 'బంగారం'.. 'తగ్గేదే లే' అంటున్న వెండి!

బంగారు, వెండి ఉంటే ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగ పడతాయిలే అనుకునేవారే మనదేశంలో ఎక్కువ. కేవలం ఆభరణాలకే కాక, అవసరాలకి కూడా ఆదుకునేవి ఇవే. అందులోనూ బంగారమంటే మన భారతీయ మహిళలకి ఎంతో ఇష్టం. మెడలో బంగారు నల్లపూసల దండైనా లేకుంటే, బయటకి వెళ్ళడం ఇబ్బందిగా ఉంటుంది అనుకుంటుంటారు. అందుకే, తరతరాలుగా మనదేశంలో బంగారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కొంతకాలం క్రితం దీని ధర సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. బంగారం ధర కొండెక్కి కూచుంది. వెండి..నేను మాత్రం తక్కువా..'తగ్గేదే లే' అంటూ ఆకాశంలోకి దూసుకుపోతోంది.

అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న అనేకానేక పరిణామాలు, ఎప్పటికప్పుడు మారిపోతున్న రాజకీయాలు, అనేక దేశాల్లో రకరకాల సంక్షోభాలు, అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థికవ్యవస్థలో అనిశ్చితి ఇలా ఎన్నో కారణాలతో వీటి ధరలు ఎవరూ ఊహించనంతగా పెరిగిపోతున్నాయని వాణిజ్యవేత్తలు చెప్తున్నారు. గతంలో ఏ 40వేలో ఉన్న 10 గ్రాముల బంగారం ధర ఇప్పుడు ఏకంగా లక్ష దాటేసింది. తాజాగా 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర లక్షా 18వేలు దాటింది. 24 క్యారెట్ల బంగారం ధర లక్షా 28వేల దాకా పలుకుతోంది. అదేవిధంగా వంద గ్రాముల వెండి ధర 20వేలు దాటి, కిలో వెండి కావాలంటే 2 లక్షల దాకా ఉంది. దీంతో మధ్య తరగతివాళ్లే కాదు, ఒకమోస్తరు డబ్బున్న వాళ్ళు కూడా 'బాబోయ్ బంగారమా!..మనం కొనలేం' అంటున్నారు. పెళ్ళిళ్ళకు బంగారం కొనేవాళ్లు, ఇతరత్రా ఫంక్షన్‌లకు బంగారు ఆభరణాలు కావాలనుకునేవాళ్ళు ఇప్పుడు బంగారం కొనాలంటేనే భయపడిపోతున్నారు. ఏ పుట్టినరోజుకో, పెళ్ళిళ్ళకో వెళ్లినప్పుడు ఆత్మీయులకి కానుకగా బంగారు వస్తువులు ఇచ్చేవాళ్ళు.. ఇప్పుడు అలాంటి వాళ్ళు ఈ ధరలు చూసి అయోమయంలో పడిపోతున్నారు. డబ్బు చేతిలో ఉంటే ఎలాగూ ఖర్చయిపోతుంది.. ఎంతో కొంత బంగారం కొని దాచిపెడితే, భవిష్యత్తులో పిల్లలకి ఆదరువుగా ఉంటుంది కదా అనుకునేవారు కూడా ఇప్పటి బంగారం ధరలు విని 'బాబోయ్!.. ఇక బంగారం కొనలేం' అనేస్తున్నారు. ఈనెల 13వ తేదీ నాటికి 10 గ్రాముల బంగారం ధర ఒక్కసారిగా లక్షా 28వేలు దాటేయడంతో, 'బంగారానికి ఇంత విలువ ఉంటుందా' అని వ్యాపారులే అవాక్కయిపోయారు. మన దేశంలో బంగారానికి ఇదే పెద్ద 'ఆల్‌టైమ్ రికార్డు'గా భావిస్తున్నారు. అదేవిధంగా, వెండి ధర కిలో లక్షా 79వేలకు పైగానే పెరిగిపోయింది. ఈ ఏడాదిలో బంగారం ధర ఇప్పటికే 50 శాతానికి పైగా, వెండి ధర 70శాతానికి పైగానే పెరిగాయి. గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగనంతగా ఏరోజుకారోజు బంగారం-వెండి ధరలు భారీగా పెరిగిపోతూనే ఉన్నాయి. నేల మీది నుంచి కొండమీదికి, అక్కడి నుంచి ఆకాశంలోకి..ఆ తర్వాత అలా అంతరిక్షంలోకీ వీటి ధరలు శరవేగంగా దూసుకుపోతుంటే, వాటి తీరు చూసి 'ఔరా! ఎంతొకవేళ బంగారమే అయినా..మరీ ఇంత వీరంగమా' అని జనం ఆశ్చర్యపోతున్నారు. అందులోనూ ఈ దీపావళి పండుగ రోజుల్లో బంగారు వెండి ధరలు ఇంకా మోత మోగిపోతాయట. అంతదాకా ఎందుకు రేపొచ్చే ధనత్రయోదశి (శనివారం) నాటికే బంగారం ధర లక్షా 30వేలు దాటినా ఆశ్చర్యపోనక్కర లేదని వాణిజ్యవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అల్లకల్లోలంగా ఉండడం, ఇతర దేశాల్లో ఉన్న బ్యాంకులు భారీస్థాయిలో బంగారం నిల్వ చేసుకోవడం వంటి కారణాలతో కూడా ఈ ధరలు ఆకాశాని కంటుతున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ అనిశ్చిత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో గురిగింజంత బంగారం కూడా కొనలేని పరిస్థితి వస్తుందని అంటున్నారు. అయినా, ఈ ధరలకే ఇంత కంగారుపడితే ఎలా?..రానున్న కొత్త సంవత్సరానికల్లా 10 గ్రాముల బంగారం ధర ఝామ్మంటూ లక్షా 50వేలకు పైగానే పెరిగిపోతుందనే అంచనాలూ లేకపోలేదు. ఇంకా మాట్లాడితే, రానున్న అయిదేళ్ళలో పసిడి ధర అక్షరాలా ముచ్చటగా మూడు లక్షలు పలికే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయని వాణిజ్య విశ్లేషకులు భావిస్తున్నారు. అన్నీ బాగుండి భవిష్యత్తులో ఒకవేళ ధరలు తగ్గినా, ఇప్పుడు పెరిగినంతగా తరిగేది మాత్రం ఉండదని అంటున్నారు. ఏదేమైనా, ఇప్పుడు బంగారం కొనాలనుకునేవారికన్నా, ముందుజాగ్రత్తతో ఇప్పటికే కొనిపెట్టుకున్నవారే అదృష్టవంతులు. రానున్న కాలంలో వారే భాగ్యవంతులు కూడా!..ఏమంటారు?..

# 'కంచే చేను మేసినట్లు'గా వ్యవహరిస్తున్న ప్రభుత్వం!

నెల్లూరు మైపాడు రోడ్డులో రోడ్డు మార్జిన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో కంటైనర్లతో 120 దుకాణాలు ఏర్పాటు చేశారు. పైగా దానికి 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' అని నామకరణం చేసి మొన్న శనివారం నాడు సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చేతనే వర్చువల్‌గా ప్రారంభింపచేశారు. ఇది మునిసిపల్ మంత్రి నారాయణ గారి మదిలో పుట్టిన అరుదైన ఆలోచనగా ముఖ్యమంత్రి సైతం ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. సదరు దుకాణాలు ఏర్పాటు చేయడానికి 8కోట్లకుపైగా ప్రభుత్వ నిధుల్ని ఖర్చుచేసినట్లు గొప్పగా చెప్పుకుంటున్నారు. నగరంలో కావలసినన్ని ప్రభుత్వ మునిసిపల్ స్థలాలు వున్నాయి. ఇలాంటి దుకాణ సముదాయానికి వాటిల్లో ఏదైనా ఓ స్థలాన్ని ఎంపిక చేసి వుంటే బాగుండేది. అలా కాకుండా 'కంచే చేను మేసినట్లు'గా ఇలా ప్రభుత్వమే రోడ్డు మార్జిన్ ఆక్రమించి అంగళ్ళు ఏర్పాటు చేయడం అర్థరహితం. ఇప్పటికే నగరంలోని అనేక ముఖ్య కూడళ్లు దురాక్రమణలతో నిండిపోయాయి. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తూ అవి వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. అలాంటి వాటిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తుందన్న సంకేతం వచ్చేలా ఈ స్మార్ట్ స్ట్రీట్ బజారుని ఏర్పాటు చేయడం విచారకరం. **– కే.వీ.కుమార్, బాలాజీనగర్.**

# వెంకయ్యనాయుడు గారి చొరవ అభినందనీయం!

సుప్రసిద్ధ నేపథ్య గాయకులు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహం నెల్లూరు నగరంలో ఏర్పాటు చేయాలని భారత పూర్వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు జిల్లా నేతలకి సూచించినట్లుగా పత్రికలలో చదివి చాలా సంతోషం కలిగింది. బాలు గారు పరమపదించి ఇప్పటికే ఐదేళ్ళు గడిచింది. నిజానికి ఆయన విగ్రహం ఎప్పుడో నెల్లూరు నగరంలో ఏర్పాటుచేసి ఉండాలి. ఇప్పటికైనా వెంకయ్యనాయుడు గారి చొరవతో ఆ మహత్కార్యం జరగబోతున్నందుకు ఆనందంగా ఉంది. జూన్ 4, 2026న బాలు గారి 80వ జయంతిని పురస్కరించుకునైనా నగరంలో మంచి ప్రాంతాన్ని గుర్తించి గానగంధర్వుడి విగ్రహాన్ని నెలకొల్పాలని నా మనవి. యావత్ ప్రపంచం అభిమానించే గాయకుడు మన నెల్లూరు వాడు కావడం మనందరికీ గర్వ కారణం. ఆయన జన్మభూమిలో ఆయనకి సముచిత స్థానం కల్పించడం మన కనీస ధర్మం. ఈ సత్కార్యానికి స్ఫూర్తి కల్పించిన వెంకయ్యనాయుడు గారికి నా ధన్యవాదాలు.

**– లక్ష్మి భరద్వాజ్, హైదరాబాదు.**




# ప్రభుత్వం ఇన్నాళ్ళుగా నిద్రపోయిందా?

రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవహారం రకరకాల మలుపు తీసుకుంటోంది. అటు తిరిగి ఇటు తిరిగి ఈ మరక కూడా వైసీపీ నాయకులకే అంటుకుంటోంది. నకిలీ సారా తయారీ దందా గత ప్రభుత్వ హయాం నుండే కొనసాగుతోందన్న వార్తలు వస్తున్నాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ కనుసైగలలోనే ఇవన్నీ జరిగాయని నకిలీ మద్యం కేసులో అరెస్టయిన ప్రధాన నిందితుడు జనార్ధనరావు చెప్తున్నాడు. అందుకు సంబంధించి కొన్ని ఆధారాలు కూడా దర్యాప్తు అధికారులు బయట పెట్టారు. జనార్ధనరావు ఇచ్చిన వాంగ్మూల వీడియోని కూడా విడుదల చేశారు. నా ప్రశ్న ఒక్కటే. ఇంత పెద్ద అరాచకం జరుగుతుంటే కూటమి ప్రభుత్వం గత 16నెలలుగా నిద్రపోతోందా...? ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అనేక దర్యాప్తు సంస్థలు, నిఘా వ్యవస్థలు కూడా ఈ నకిలీ వ్యవహారాన్ని కనిపెట్టలేక పోయాయంటే ఇది ప్రభుత్వానికే అవమానం కాదా?

**డి.హరిత, గూడూరు.**




# ఉచితాలు సముచితాలా.. అనుచితాలా!

ఎవరికైనా 'పెడతామంటే ఆశ.. కొడతామంటే భయం' అన్న సామెతగా, ప్రజలకి ఏదైనా ఉచితంగా ఇస్తామంటే ఎవరైనా ఆశపడడంలో ఎలాంటి తప్పులేదు. అందులోనూ ప్రభుత్వాలే స్వయంగా ఇంటికొచ్చి మరీ తాయిలాలు చేతిలో పెడతామంటే ఎంతటి వారైనా ఎందుకు వద్దంటారు...? మనదేశంలో ఇప్పుడు కాదు, ఎంతోకాలం నుంచి అనేక రాష్ట్రాల్లోని నాయకులు ప్రజలకు ఉచిత పథకాలు పంచిపెట్టడం ఆనవాయితీగా మారిపోయింది. అయితే, ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది కష్టజీవులు, కార్మికులు, నిరుపేదలు మూడుపూటలా అన్నం దొరక్క అల్లాడిపోతూనే ఉన్నారు. అసలు ఈ ఉచితాలు అర్హులైన లబ్ధిదారులకి చేరుతున్నాయా లేదా...? అన్నది సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోతోంది.

## బుద్ధి చెప్పినా.. బుద్ధి రాలేదు!

అసలు, ఉచితాలు మంచికా, చెడుకా అన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు ఆలోచించడం లేదు. పోటీలు పడి ఒకరికంటే మరొకరు ఎక్కువగా లక్షలకోట్లల్లో ఉచితాలు ఇచ్చి ప్రజల ఓట్లను గెలుచుకోవాలనే తపన పడుతున్నారు. అంతే తప్ప ఉచితాల వల్ల కలిగే నష్టాన్ని వాళ్ళు అంచనా వేయడం లేదు. ఫలితంగా ఉచితాలు అందుకోలేని ప్రజలు కూడా ఆ ఉచితాలేదో మాక్కూడా ఇవ్వాలంటూ డిమాండ్ చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో దేశంలో ఉచిత పంపకాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పన్నుల రూపంలో ప్రజల దగ్గర దండుతున్న డబ్బును మళ్ళీ ప్రజలకే పంచిపెట్టడం మంచిదే కదా అన్నది వారి వాదన.

నిజమే!.. ప్రజలదేముంది ఇస్తే తీసుకుంటారు, లేదంటే ఊరుకుంటారు. ఇంతకాలం వాళ్ళేమీ ఉచితాలతోనే బతకలేదుగా! అయితే, నేటి రాజకీయాల్లో ఉచితాలదే కీలకపాత్ర అయిపోయింది. దండిగా ఉచితాలిచ్చే ప్రభుత్వాలను ప్రజలు కాదనరని, మళ్ళీమళ్ళీ తమనే కావాలనుకుంటారన్నది నాయకుల ధీమా. కానీ, అది కేవలం భ్రమే అన్న విషయం, ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో స్పష్టంగా తేలిపోయింది. వేలు కాదు, లక్షల కోట్లు ఉచితాల పేరుతో ఇచ్చినా, ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి మూలన కూర్చోబెట్టారంటే.. ప్రజలు తమకేం కావాలో చెప్పకనే చెప్పారు! అయినా, నేటి నాయకులు ఇంకా మేల్కోవడం లేదు. అనుచితమైన ఉచితాలతో మొత్తం రాష్ట్ర ఖజానాని ఖాళీ చేసిన గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పినా ప్రస్తుత ప్రభుత్వపెద్దలకి బుద్ధి రాలేదు. గతంలో కంటే గొప్పగా ఉచితాలను జనానికి పంచాలనే యోచిస్తున్నారు.

## అన్ని ఉచితాలూ అనుచితం కాదు...!

అయితే, ఇక్కడ ముఖ్యంగా తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. అన్ని ఉచితాలూ అనుచితం కాదు. కొన్ని సముచితమైనవి కూడా ఉన్నాయి. బడుగు బలహీనవర్గాల వారికి, దీనులకి, ఏ ఆధారమూ లేని అనాధలకి, నిరాధార మహిళలకి, అన్నం కూడా దొరకని అన్నార్తులకి, ఎవరి చేయూతా లేని వృద్ధులకి ఉచితాలిస్తే ఎవరు కాదంటారు? ఇప్పటికీ కూలినాలి చేసుకుంటూ రెక్కాడితే తప్ప డొక్కాడని కార్మికులు కోట్లాది మంది మన దేశంలో ఉన్నారు. చేయగలిగితే వారికేదైనా ఈ ఉచితాల ద్వారా సాయం చేయొచ్చు. అయితే ఏ పథకమైనా సరే పారదర్శకంగా ఉండాలి. పార్టీలకి అతీతంగా అమలుకావాలి. కేవలం 'ఓట్లను దృష్టిలో పెట్టుకుని' స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉచితాలందిస్తే మాత్రం చివరికి, ఆయా పార్టీలకి లేదా నాయకులకి ఆశాభంగం తప్పదన్న విషయం ఇటు ఆంధ్రాలోనూ అటు తమిళనాడులోనూ పలు అనుభవాలు స్పష్టం చేశాయి. అయినా, నేటికీ ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాల్లో పాలకులు ఆ డొంకదారిలోనే వెళ్తుండడం విచారకరం.

## అభివృద్ధి పథకాలు.. గాలికి!

నిజానికి ప్రజలకి కావలసింది అభివృద్ధి పథకాలు. సంక్షేమ పథకాలు కూడా కావాల్సిందే. ఈ రెండింటికీ సమన్వయం ఉండాలి. ఉచితాలిస్తున్నామని చెప్పి, అభివృద్ధి పథకాలను గాలికి వదిలేయడం మంచి సంప్రదాయం కాదు. పన్నుల ద్వారానో, లేదా ఇతరత్రా మార్గాల్లోనో ప్రజల నుంచి వచ్చే ధనాన్ని ప్రభుత్వాలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి అభ్యున్నతి కోసం ఉపయోగించాలి. అలా కాకుండా కేవలం ఉచితాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం ఎంతమాత్రం సమంజసం కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ విషయంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు. దేశానికి అన్నంపెట్టే వ్యవసాయం, నాణ్యతతో కూడిన సాంకేతిక విద్య, ఆధునిక వైద్యం, మైనర్ , మేజర్ నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధి లాంటివి అనేకం ఉన్నాయి. అవన్నీ వదిలేసి ఓట్లని, ఎన్నికలని దృష్టిలో పెట్టుకుని ఉచితాలివ్వడం సముచితం కాదు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇప్పుడు ఉచితాల తంతే కొనసాగుతుండడం దురదృష్టకరం. మన పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా పలు సందర్భాలలో ఉచితాల పట్ల స్పందిస్తూ, అవి అభివృద్ధి నిరోధకాలుగా తయారవుతున్నాయని, ప్రజలకి కావాల్సింది అభివృద్ధే తప్ప ఉచిత పథకాలు కాదని కామెంట్ చేశారు. అంతేకాకుండా, ఆ ఉచిత పథకాలకు లక్షల కోట్ల డబ్బు ఎక్కడినుంచి తెస్తున్నారు, ఒకవేళ వాటిని అప్పుగా తెస్తుంటే మళ్ళీ ఎలా చెల్లిస్తారు వంటి అంశాలపై ప్రభుత్వాలు అసెంబ్లీలో అఫిడవిట్ ఇవ్వాలని కూడా సూచించారు. ప్రజలకి అవసరమైన విద్య వైద్యం వంటి వాటిని ఉచితంగా అందించగలిగినప్పుడే ప్రయోజనం అని కూడా ఆయన స్పష్టం చేశారు. అంతటి అనుభవజ్ఞులు చెప్పే విషయాలనైనా నేటి పాలకులు, ప్రభుత్వాలు ఆచరించాలి. లేదంటే, దేశమంతా రకరకాల పేర్లతో విచ్చలవిడిగా పంపిణీ అవుతున్న ఈ ఉచిత తాయిలాలే క్రమేణా నాయకులని, రాజకీయాలనే కాకుండా ప్రభుత్వాలని సైతం శాసించే స్థితి కల్పిస్తాయి. చివరికి ఆ ఉచితాలే దేశ భవిష్యత్తును సైతం అగమ్యగోచరం చేసే పరిస్థితులు ఏర్పడతాయి..!

**- రాజశ్రీ**









# 'విశ్వసముద్ర' సేవలు భేష్

## ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో అభినందించిన ముఖ్యమంత్రి





రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల జిల్లా పర్యటనకు రావడంతో టీడీపీ నేతల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సీఎం కార్యక్రమాలకు హాజరయ్యారు. నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో శశిథర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నందగోకులం లైఫ్‌స్కూల్, సేవ్ ద బుల్, విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సీఎంతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఇథనాల్ ప్లాంట్‌లతో పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. ఇక్కడ 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తోందని, దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాలు కొనుగోలు చేయడం రైతులకు కూడా ఎంతో ఉపయోగకరమన్నారు. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారుచేస్తూ వారు దేశ ప్రగతికి తోడ్పడుతున్నారంటూ ఆ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న విశ్వసముద్ర ప్రతినిధుల సేవలను కొనియాడారు. అలాగే పశు సంపదను, మన వారసత్వాన్ని కాపాడేందుకు ట్రెడ్‌మిల్ మిషన్‌పై ఎద్దులతో వ్యాయామం చేయిస్తూ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా నూతన ప్రయోగం చేయటం అభినందనీయమన్నారు. ఇక్కడి గోశాలలో సుమారు 400 పైగా పశుజాతులను సంరక్షిస్తూ మన వారసత్వ సంపదను ముందుకు తీసుకెళ్లడం గొప్ప విషయమన్నారు. నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ప్రత్యేకంగా ముఖ్యమంత్రి అభినందించారు. 'సమాజానికి తిరిగి ఇవ్వటం అనే ఆశయంలో భాగమే పీ4' అని, డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమూ ముఖ్యమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. అంతేకాదు, 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందని, అదే స్ఫూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, విశ్వసముద్ర గ్రూపు ప్రతినిధులతో పాటు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోటంరెడ్డికి.. సీఎం ప్రశంసలు

బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వేదికపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్దఎత్తున జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, 24గంటలూ త్రీఫేస్ విద్యుత్ సరఫరా, విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు 43 కోట్ల రూపాయలతో జరుగుతున్న పనులను శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెలాఖరు లోపల ఈ పనులు పూర్తవుతాయని, దీనివల్ల రూరల్ నియోజకవర్గంలో 80 వేల మందికి పైగా ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. అభివృద్ధి పనుల వివరాలతో బుక్‌లెట్‌ను ముఖ్యమంత్రికి అందజేశారు. దీనికి 'చంద్రన్న విద్యుత్ వెలుగులు'గా నామకరణ చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డిని ముఖ్యమంత్రి ప్రశంసించి, ఆయన చేస్తున్న అభివృద్ధికి అభినందించారు.



జననం:-1946

నిర్యాణం : 2023

# ద్వితీయ వర్ధంతి

మా కుటుంబ అభివృద్ధికి స్ఫూర్తిప్రదాత
ప్రేమామృతాలను పంచిన అనురాగదేవత

## శ్రీమతి జక్కా సులోచనమ్మ గారు

పరమపదించి తేది. 21.10.2025 నాటికి
రెండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
**వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...**

భర్త : **జక్కా కోదండరామరెడ్డి (జె.కె.రెడ్డి)**
మాజీ శాసనసభ్యులు, నెల్లూరు.

కుమారులు - కోడళ్ళు
**జక్కా వినూజ రామ్మోహన్**
**జక్కా జనార్ధన్‌రెడ్డి - స్మిత**

కుమార్తె - అల్లుడు
**పద్మజ - ఏ.బి.వి. రమణారెడ్డి**

మనుమళ్ళు మనుమరాళ్ళు
**జక్కా మనవ్, జక్కా కోదండ శ్రీవత్స**
**రిధి - సిద్ధాంత్**
**ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్**

# నెల్లూరు కబుర్లు

## ఆడపిల్ల ఇంటికి వెలుగు



ఆడపిల్ల ఇంటికి వెలుగు అని, భవిష్యత్ తరాల మనుగడకు ఆడబిడ్డలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈనెల 11న నెల్లూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అధికారులు, అంగన్‌వాడీ, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ప్రైవేటు వైద్యశాలలు, ల్యాబ్‌లలో ఈ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఐసిడిఎస్ పీడీ హేనాసుజన్, డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సుజాత, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఇంటర్ మీడియట్ ప్రాంతీయ అధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రి కో-ఆర్డినేటర్లుగా.. యాలమూరి, కలికి



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి కో-ఆర్డినేటర్లుగా యాలమూరి రంగారావు (రంగయ్య నాయుడు), కలికి శ్రీహరిరెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కో-ఆర్డినేటర్లుగా ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తామని, ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఏవైనా సమస్యలుంటే తమకు తెలియజేయ వచ్చన్నారు. నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, జీఎం ఐ.భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్ ఆధ్వర్యంలో.. పేదలకు దుప్పట్లు



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న శ్రీ సాయి దర్బార్ అద్దాలమందిరం నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో ఈనెల 12న పేదలకు దుప్పట్లు పంచారు. శ్రీ సాయిబాబా 107వ మహాసమాధి(ఆరాధన) మహోత్సవాల సందర్భంగా యువసేవాదళ్ సభ్యులు నెల్లూరులోని అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల మీద, మందిరాలు, బస్టాండ్‌లు, ప్రార్థనా మందిరాల వద్ద తలదాచుకుంటున్న నిరుపేదలకు దుప్పట్లు ఇచ్చారు. గత పదిహేను సంవత్సరాలుగా పేదలకు దుప్పట్లు అందజేస్తున్నామని, ఇందుకు సహకరిస్తున్న దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మాదకద్రవ్యాలతో ముప్పు

- - - ఎక్సైజ్ అధికారుల హెచ్చరిక - - -



మాదకద్రవ్యాలతో ఆరోగ్యానికే కాక, మొత్తంగా జీవితాలకే ముప్పు వస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ పి.రమేష్‌బాబు, ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.ప్రభాకర్‌రావు విద్యార్థులను హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఈనెల 10న 'మాదకద్రవ్యాలు – వాటి దుష్ప్రభావాలపై' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల వల్ల కలిగే భయానక పరిణామాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. నిరుపమ డీ-అడిక్షన్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.రవీంద్ర, ఈగిల్ విభాగానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయాలి



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి గణేష్‌కుమార్‌యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని ఇందిరాభవన్‌లో, డీసీసీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీతో కలిసి ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు సమాచార చట్టం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఆ చట్టం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, అయితే ఇప్పుడు దానిని కూటమి ప్రభుత్వం తీసేయాలనే ఆలోచనతో ఉందన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. 2029లో కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అలరించిన సంగీత విభావరి



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల సౌజన్యంతో ఈనెల 12న తొలిసారిగా నెల్లూరులో ప్రముఖ హిందీ సినీ గాయకుడు 'కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్-2025' అందరినీ అలరించింది. గాయకుడు జావేద్ బృందం కిషోర్‌కుమార్ పాటలను అద్భుతంగా గానం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ ఏడాది జులై 20న నిర్వహించిన యాద్ ఏ రఫీ కార్యక్రమం సందర్భంగా, గొప్ప గాయకుడు కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్ కూడా నిర్వహించాలని, అందుకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆదివారం జరిగిన మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని వారి సహకారంతో నిర్వహించారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో వేమిరెడ్డి ఎప్పుడూ ముందుంటారని మరోసారి రుజువు చేశారని నిర్వాహకులు కొనియాడారు. ఈ సందర్భంగా విపిఆర్ దంపతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.







## దివ్యాంగులకు.. విపిఆర్ దంపతుల చేయూత

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మరోసారి తమ గొప్ప మనసును చాటారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తాము మాట ఇస్తే.. తప్పకుండా అండగా నిలబడతామంటూ రుజువు చేశారు. నెల్లూరు, పొదలకూరుల్లో ఉన్న 'భవిత' కేంద్రాల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభతో మంచి ఫలితాలు సాధించిన దివ్యాంగ విద్యార్థినుల ఉన్నత చదువులకు ఇటీవల ఆర్థిక సహాయం చేశారు. నెల్లూరులోని విపిఆర్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, కళాశాల ఫీజుల నిమిత్తం విద్యా స్వరూపిణి అనే విద్యార్థినికి లక్షా 30వేలు, సిరివల్లికి లక్షా పాతికేవేలు, భవాని పూజితకు 30 వేల రూపాయలు వంతున సాయం అందిస్తూ, వారి తల్లిదండ్రులకు ఆ మొత్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ ప్రసాద్‌రావు, ఎంఈవో మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న 'మెర్మెడ్ షో'

నెల్లూరు, ఎన్‌టీఆర్ నగర్ హైవేలో ఉన్న ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో ఈనెల 10న ప్రారంభమైన పినాకిని ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నగర ప్రజలను బాగా ఆకట్టుకుంటోంది. ఇందులో విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన సాగర జలకన్య, జలకన్యుడు (మెర్మెడ్ షో) విన్యాసాలు, వాటర్ టన్నెల్లో సాహసాలు వగైరాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచ ప్రఖ్యాత నయాగరా జలపాతం ఏర్పాటుతో పాటు, అనేకరకాల వస్త్ర, గృహోపకరణ వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేశామని, సుమారు 50 రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు ఎం.రాజారెడ్డి, ఎస్‌కె బాబు, గడ్డం అచ్చయ్యనాయుడు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, సెలవురోజుల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్‌ని నిర్వహిస్తామన్నారు. జెయింట్ వీల్, కొలంబస్ వంటి అనేకరకాల అమ్యూజ్‌మెంట్స్ అన్నీ ఉండడంతో, పిల్లలు పెద్దలు అందరికీ ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఆసక్తిని, సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవం



నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రపంచ కోడి గుడ్డు దినోత్సవాన్ని నిర్వహించారు. బెజవాడ సునీల్‌రెడ్డి సహకారంతో, 500 మందికి ఉడికించిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. నెక్ మాజీ జోనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు కోడిగుడ్డు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఏటా అక్టోబర్ రెండవ శుక్రవారం నిర్వహిస్తూ క్రీడాకారులకు, వాకర్స్‌కు తాము కోడిగుడ్లను పంపిణీ చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి మాగంటి ప్రసాద్, వాకర్స్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి, షేక్ నసీర్‌అహ్మద్, బిరదవోలు రామమోహనరెడ్డి, బెల్లం చెంచయ్యనాయుడు, పత్తిపాటి రమణయ్య, టి.హరిబాబునాయుడు, బి.సదానందారెడ్డి, కాగోళ్ళు శివయ్య, కె.వెంకటరమణ, వి.ఆదినారాయణరెడ్డి, మన్నేపల్లి సురేష్, గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, దాసరాజు వెంకటరాజు, కిలారి మధుసూదనరావు పాల్గొన్నారు.

# కామాక్షమ్మ ఆస్తులను కాపాడండి!

## పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సూచన



రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆలయ పాలకమండలి సభ్యులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. ఇటీవల జొన్నవాడ దేవాలయంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ ఛైర్మన్‌గా తిరుమూరు అశోక్‌రెడ్డితో పాటు మరో 12 మంది పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ, ఆలయ పవిత్రతను పరిరక్షించాలన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు సౌకర్యాల విషయంలో పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అమ్మవారి ఆలయ ఆస్తుల రక్షణతో పాటు గతంలో ఆక్రమణలకు గురైన ఆస్థులను స్వాధీనం చేసుకునే దిశగా ఆలయ కమిటి కృషి చేయాలని కోరారు.



## క్రీడాకారులకు ప్రోత్సాహం

విపిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గంలోని యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఇందుకూరు పేట మండలం గంగపట్నం గ్రామంలో పెనుబల్లి రామకృష్ణయ్య -రమణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ఆమె పాల్గొన్నారు. పోటీలు నిర్వహించిన ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ పెనుబల్లి కృష్ణచైతన్యని ఎమ్మెల్యే అభినందించారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఛాంపియన్‌గా నిలిచిన గంగపట్నం జట్టు సభ్యులను అభినందించారు.

## అగ్నిబాధితులకు సాయం



కొడవలూరు మండలం రాజుపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో 4 ఇళ్ళు ఆహుతైపోయాయి. ఆ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. దగ్ధమైన ఒక్కో ఇంటికి 25వేల రూపాయల సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తరఫున ఇల్లు మంజూరు చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట



జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరట కలుగుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 14న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జీఎస్టీపై ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న జీఎస్టీ సంస్కరణల నిర్ణయం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోందన్నారు. దీనివల్ల ప్రజలకు ఆర్థికంగా లబ్ది చేకూరుతోందని, ప్రజల్లో దీనిపట్ల మరింత అవగాహన కలిగించాలన్నారు. మాజీ మేయర్ భానుశ్రీ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.











## ఉదయగిరి చెక్కపని అద్భుతం!

ఉదయగిరి చెక్కపని అద్భుతమని, వారు తయారుచేస్తున్న వస్తువులు చాలా కళాత్మకంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఇటీవల ఆయన జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కలెక్టర్ ఉదయగిరి ఉడ్ కట్లరీని సీఎంకి బహుకరించారు. దాన్ని చూసిన సీఎం, ఈ కళాత్మకత ఎందో బాగుందన్నారు. ఆ చెక్క వస్తువుల తయారీని ప్రోత్సహించాలని కలెక్టర్‌కి సూచించారు. సంప్రదాయ చెక్క పనిని ఆధునిక రూపంలో తీర్చిదిద్దుతూ తయారు చేసే చెక్క కట్లరీలు స్పూన్లు, ఫోర్కులు, కత్తులు, బౌల్స్, వంట సామాన్లు, డెకరేటివ్ వస్తువులు అందం, నాణ్యతలో ప్రత్యేకమైనవిగా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపుపొందిన విషయం తెలిసిందే. దాదాపు 150 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కళలో ఉదయగిరి ప్రఖ్యాతిచెందింది కూడా. ఈ నేపథ్యంలో, జిల్లాలో హస్త కళలను, కళాకారులను ప్రోత్సహించడం వల్ల కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని సీఎం కలెక్టర్‌కి చెప్పారు.

## శ్రీశైల మల్లన్న సేవలో.. వాయిగండ్ల వెంకట్



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవాలయ ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులుగా వర్ఛ్యుసా లైఫ్ స్పేసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ వాయిగండ్ల వెంకట్ ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, మిగిలిన సభ్యులతో కలిసి దేవస్థానం ఇ.ఓ శ్రీనివాసరావు ఆయనచే ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. తమ సంస్థ అధినేతకు శ్రీశైలంలో భక్తులకు సేవచేసే అవకాశం లభించడంపై వర్ఛ్యుసా లైఫ్ స్పేసెస్ కంపెనీ సీజీఎంలు అభినవ రాజు, సుధాకర్, సత్తార్, విజయకుమార్, ప్రసాద్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.




## శ్రీసిటీలో..
# శ్రీ తులసి ఆయుర్వేద ఆసుపత్రికి భూమి పూజ



అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన పారిశ్రామికవాడ..శ్రీసిటీలో ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి ఈనెల 13న భూమి పూజ జరిగింది. శ్రీ తులసి ఆయుర్వేద ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలి దశలో రూ.75 లక్షల పెట్టుబడితో 10 పడకలు, ప్రత్యేక అవుట్‌పేషెంట్ సేవలతో వచ్చే ఉగాది నాటికి ఈ ఆసుపత్రి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని డా. శివప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఆసుపత్రిలో పంచకర్మ, ప్రసూతి తంత్ర (ప్రసూతి మరియు స్త్రీ సంబంధిత వ్యాధులు), కాయచికిత్స (సాధారణ వైద్యం) వంటి ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి డయగ్నస్టిక్ ల్యాబ్, పంచకర్మ మరియు క్షారసూత్ర చికిత్స, యోగా మరియు వెల్‌నెస్ సౌకర్యాలు, సంతానోత్పత్తి, రుమటాలజీ, జీవనసరళికి సంబంధించిన వ్యాధులు, చర్మ– సౌందర్య చికిత్సల విభాగాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిరీషా మాట్లాడుతూ, సాంప్రదాయ ఆయుర్వేద జ్ఞానాన్ని ఆధునిక వైద్య విధానాలతో సమన్వయం చేస్తూ శ్రీ తులసి ఆయుర్వేద ఆసుపత్రి శ్రీసిటీలో సమగ్ర ఆరోగ్య కేంద్రంగా ఎదుగుతుందని ఆకాంక్షించారు. శ్రీసిటీలోని సహజసిద్ధమన ప్రకృతి, అనువైన వాతావరణం దీనికి అత్యంత అనుకూలంగా ఉంటాయన్నారు.

# సాంకేతికత-సృజనాత్మకతల కలయికగా..'ఆవిష్కార్'

**• ఎన్‌బీకేఆర్ డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి**




సాంకేతికత – సృజనాత్మకతల కలయికే ఆవిష్కార్–2కె25 సదస్సు లక్ష్యమని ఎన్‌బీకేఆర్ డైరెక్టర్ డా. వి.విజయ కుమార్‌రెడ్డి చెప్పారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఆవిష్కార్–2కే జాతీయస్థాయి సాంకేతిక సదస్సు ఘనంగా జరిగింది. కళాశాల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో, ఐఇటీయి స్టూడెంట్ ఫోరమ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో పరిశోధకులుగా, కొత్తకొత్త ఆవిష్కరణ కర్తలుగా ఎదిగేందుకు ఇలాంటి సదస్సులు ప్రేరణగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు కూడా ఇదో మంచి అవకాశమని, ఇందులో పాల్గొనే ప్రతి విద్యార్థి వినూత్నమైన సాంకేతిక ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తదనాన్ని నేర్చుకోవడం, పంచుకోవడం విద్యార్థులు అలవరచుకోవాలని, ఆవిష్కార్ వేదిక ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఈ సదస్సులో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు సూచించారు. స్టూడెంట్ ఆఫైర్స్ డీన్ డా. జి.హరినాథరెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు నూతన ఆలోచనలతో ఆవిష్కరణలు చేసేందుకు ఉపకరిస్తాయన్నారు. ఇసిఇ విభాగాధిపతి డా.ఎస్‌కె మహబూబ్‌బాషా, సదస్సు కన్వీనర్ డా.వై.మురళీమోహన్‌బాబు మాట్లాడుతూ, ఈ సదస్సులో విద్యార్థులకు పేపర్ ప్రెజెంటేషన్; పోస్టర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్స్ వంటి విభిన్నమైన అంశాలుంటాయన్నారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ డా. కె.రాధిక, ఇసిఇ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇటీవల ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ప్రముఖ కంపెనీ 'స్నోవాసిస్' ప్రతినిధి, సీనియర్ ఆపరేషన్ మేనేజర్ కిషోర్, అసిస్టెంట్ టీమ్ లీడర్ సుధీర్‌లు పాల్గొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 430 మంది విద్యార్థులు పాల్గొన్నారని, హెచ్‌ఆర్ రౌండ్ పూర్తయ్యాక విద్యార్థుల ఎంపిక ఉంటుందని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.కిషాందర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా
# గూడూరు డివిజన్

# సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్

**ఎమ్మెల్యే పాశం సునీల్**



'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్'లో భాగంగా ఇటీవల గూడూరులోని జి.ఎస్ రాయులు కళ్యాణ మండపంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'గ్రాండ్ ఎలక్ట్రానిక్ సేల్ ఎగ్జిబిషన్' ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, గూడూరు సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక గాంధీ బొమ్మ నుండి ర్యాలీగా వెళ్లి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు వల్ల నిత్యావసర సరుకులు, మందుల ధరలు తగ్గాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా దీని గురించి అధికారులు, నాయకులు అవగాహన కల్పించాలని, వ్యాపారస్తులు కూడా న్యాయబద్ధంగా తమ వ్యాపారాలు కొనసాగించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను వారు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సేల్ టాక్స్ ప్రాక్టీషనర్ కోటా సునీల్‌కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, గుబ్బ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



**తాళమ్మ అమ్మవారికి**
# ప్రత్యేక పూజలు

గూడూరు పట్టణ శివారులో వెలసి ఉన్న శ్రీ తాళమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 12న ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆరుమూళ్ళ శివప్రసాద్ – సుధారాణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కమిటీ ఛైర్మెన్ చిట్టెం శ్రీనివాసులుగౌడ్, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందాలి

**- బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు కార్మికులకు చేరేలా బీజేఎంఎస్ కృషి చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా మాజీ జాతీయ అధ్యక్షులు, భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్ జాటవ్ పేర్కొన్నారు. ఈ నెల 12న గూడూరు రెండో పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో గూడూర్ డివిజన్‌లోని బీజేఎంఎస్ కార్మిక సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథులుగా జాతీయ అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. నూతనంగా ఎన్నికైన జిల్లాల అధ్యక్షులకు జాతీయ అధ్యక్షుల ద్వారా నియామక పత్రాలను అందజేశారు. అనంతరం జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో గత 5 సంవత్సరాల నుండి మైనింగ్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం, రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ యాదవ్ ద్వారా తెలిసిందని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి మైనింగ్ కార్మికులకి ఉపాధి కల్పించేందుకు బీజేఎంఎస్ కృషి చేస్తుందని తెలిపారు. బీజేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సామేలు, జాతీయ ఉపాధ్యక్షులు దేవకుమార్ శర్మ, వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



**ఇటీవల గూడూరు వ్యవసాయ మార్కెటింగ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొని ఛైర్మెన్ చిల్లకూరు నీరజమ్మ, వైస్‌ఛైర్మెన్ సోమిశెట్టి చెంచురామయ్య, వివిధ డైరెక్టర్లచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్.**

# మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు

గూడూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 17వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు జీఎస్టీ ధరల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజాప్రతి నిధులు, అధికారులతో కలిసి ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



### రైతులకు లాభసాటి సేద్యంపై
# అవగాహన కల్పిస్తాం
### కలెక్టర్ హిమాన్షు శుక్లా



రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులతో వ్యవసాయం ద్వారా ఆదాయార్జన తగ్గిపోతున్న నేపథ్యంలో జిల్లాలో వినూత్నంగా ఛాంపియన్ ఫార్మర్ (వ్యవసాయ విజేతలు) అనే నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈనెల 13న కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 722 గ్రామపంచాయతీల నుండి ఔత్సాహిక రైతులను ఎంపికచేసి వారిని వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ వారు పంట పురోగతిని చూపిస్తూ, ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపేవారుగా, సాగునీటి నిర్వహణలో నైపుణ్యం సాధించేవారిగా, మంచి ఎరువులు, పురుగుమందుల నిర్వహణ పద్ధతులు పాటించే విధంగా చూస్తామన్నారు. రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ఆచరించడం తదితర నైపుణ్యాలను అందిపుచ్చుకునేవిధంగా తయారుచేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ యం.వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 63 మంది విద్యార్థులకు..
# 'సారంపాటి విద్యా నిధి' సాయం

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి' సంస్థ పాలకవర్గ సమావేశం ఈనెల 12న జరిగింది. స్థానిక సావిత్రినగర్‌లోని పి.దయానంద నివాసంలో జరిగిన ఈ సమావేశానికి సంస్థ అధ్యక్షులు ఇనుకొండ చక్రపాణి అధ్యక్షత వహించారు. 2025-26 విద్యా సంవత్సరానికి 63 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, పాలిటెక్నిక్, ఫార్మశీ, ఫిజియోథెరపీ కోర్సులు చదువుకునేందుకు మొత్తం లక్షా 61వేల రూపాయలను సంస్థ ద్వారా మంజూరు చేశారు. ఇందులో 40వేల రూపాయలను విరాళంగా సేకరించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ కార్యదర్శి దయానంద, టి.సురేష్, శ్రీనివాసాచార్యులు, నారాయణ రావు, నాగేశ్వరరావు, డి.నాగార్జునాచార్యులు, ఎం.పెంచల నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# గుర్రం జాషువా సాహిత్యంపై.. 26న సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఈనెల 26న మహాకవి గుర్రం జాషువా సాహితీ వైభవాన్ని వివరిస్తూ 'విశ్వనరుడు గుర్రం జాషువా' అనే అంశంపై సభ జరుగుతుందని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేవీ రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై టీ-నగర్‌లోని కృష్ణాహాల్-ఆంధ్రాక్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరిగే ఈ సభలో నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త బొగ్గరపు రాధాకృష్ణమూర్తి పాల్గొని గుర్రం జాషువా సాహిత్యంలోని గొప్పదనాన్ని వివరిస్తారన్నారు. సాహిత్యాభిమానులందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# కౌలురైతుల కష్టాలు తీర్చాలి

రాష్ట్రంలోని కౌలురైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కొత్త కౌలుచట్టం తెస్తామని, పాత చట్టాలను రద్దుచేస్తామని చెప్పి 18 నెలలు దాటినా ప్రభుత్వం ఆ మాటలు నిలబెట్టుకోలేదని రాష్ట్ర కౌలురైతుల సంఘం నాయకుడు తుళ్ళూరు గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ హామీలు నెరవేర్చడంతోపాటు కౌలురైతులకు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వాలని ఆయన కోరారు. ఆమేరకు ఈనెల 13న కోవూరు తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. రైతు నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, మోహన్‌రావు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు దార్శనికతకు దర్పణం
# విశాఖలో గూగుల్

ఒక నాయకుడి దార్శనికత ఒక రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఎలా ముందుకు నడిపిస్తుందో చెప్పడానికి చరిత్రలో కొన్ని అద్భుత ఘట్టాలుంటాయి. పాతికేళ్ళ క్రితం బీడు భూముల్లో సైబరాబాద్‌కు శంకుస్థాపన చేసి, ప్రపంచపటంలో హైదరాబాద్‌కు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతే, నేడు ఆంధ్రప్రదేశ్ తీరంలో మరో చారిత్రక ఘట్టం పునరావృతానికి కారణమైంది. ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో సుమారు 15 బిలియన్ డాలర్ల (రూ.1.25లక్షల కోట్ల) భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఏఐ హబ్, కేవలం ఒక ఒప్పందం కాదు.. అది దార్శనికతకు దక్కిన ఘన విజయం.

### గతం నుంచి వర్తమానానికి.. అదే దార్శనికత, అవే ఫలితాలు

సాంకేతికత శక్తిని ముందుగానే పసిగట్టి, దానిని అభివృద్ధికి సోపానంగా మార్చడంలో చంద్రబాబునాయుడిది అందెవేసిన చేయి. 1990ల చివర్లో, దేశంలో కంప్యూటర్ల గురించి పూర్తి అవగాహన లేని రోజుల్లో, ఆయన హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్, ఐఎస్‌బీ, ఐఐఐటీ వంటి ప్రపంచ స్థాయి సంస్థలను తీసుకువచ్చారు. అది కేవలం కొన్ని కంపెనీలను ఆకర్షించడం కాదు.. ఒక నగరపు ఆలోచనా విధానాన్ని, యువత ఆకాంక్షలను, రాష్ట్ర ఆర్థిక గమనాన్ని మార్చివేసిన ఒక విప్లవాత్మక అడుగు. ఆనాడు ఆయన వేసిన పునాదులే నేడు హైదరాబాద్‌ను ఒక గ్లోబల్ ఐటీ హబ్‌గా నిలబెట్టాయి. నేడు, అవే అనుభవంతో, నూతన ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా (Knowledge Economy) మార్చే బృహత్తర లక్ష్యంతో ఆయన మరోసారి తనదైన ముద్ర వేశారు. అప్పుడు హైదరాబాద్, ఇప్పుడు విశాఖపట్నం. ఇది యాదృచ్ఛికం కాదు, ఒక స్పష్టమైన, దీర్ఘకాలిక వ్యూహం.

### విజన్ వెనుక ఉన్న కార్యాచరణ..

దార్శనికత అనేది కేవలం కలలు కనడం కాదు, వాటిని సాకారం చేసేందుకు కావాల్సిన పట్టుదల, ప్రణాళిక, కార్యాచరణను జోడించడం. ఈ గూగుల్ ప్రాజెక్ట్ వెనుక అటువంటి బలమైన కృషి ఉంది. ఈ స్థాయి పెట్టుబడిని ఆకర్షించడానికి, గూగుల్ వంటి సంస్థలు ఆశించే ప్రత్యేక ప్రోత్సాహకాలను, విధానపరమైన స్పష్టతను అందించడంలో ముఖ్యమంత్రి చూపిన చొరవ అసాధారణం. ఈ ప్రాజెక్ట్ కోసమే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని, జాతీయ డేటా సెంటర్ పాలసీ-2020లో అవసరమైన మార్పులు చేయించడం, ఆయన పాలనా దక్షతకు, చిత్తశుద్ధికి నిదర్శనం. ఒక విజన్‌ను క్షేత్రస్థాయిలో వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఎంతటి పట్టుదలతో పనిచేస్తారో చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు.




### కేవలం పెట్టుబడి కాదు, భవిష్యత్తుకు పునాది

ఈ ప్రాజెక్టును కేవలం ఒక డేటా సెంటర్‌గా చూడటం దాని పరిధిని తక్కువ అంచనా వేయడమే అవుతుంది. ఇది ఒక సంపూర్ణ, స్వయం సమృద్ధ టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థ. ఇందులో మూడు ప్రధాన విభాగాలున్నాయి:

**అత్యాధునిక ఏఐ డేటా సెంటర్:** ఇది ప్రాజెక్టుకు గుండెకాయ లాంటిది. సాధారణ సమాచార నిల్వ కేంద్రంలా కాకుండా, ఇది ఏఐ, మెషిన్ లెర్నింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన TPU, GPUలతో కూడిన ఒక "డిజిటల్ మహా మెదడు". చాట్‌జీపీటీ వంటి సంక్లిష్ట ఏఐ నమూనాలకు శిక్షణ ఇవ్వగల అపారమైన కంప్యూటింగ్ శక్తి ఇక్కడ కొలువుదీరుతుంది. ఇది దేశీయంగా ప్రపంచ స్థాయి ఏఐ ఆవిష్కరణలకు ఊపిరి పోస్తుంది.

**అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వే:** ఇప్పటివరకు మన దేశ ఇంటర్నెట్ ట్రాఫిక్ ముంబై, చెన్నై గేట్‌వేలపైనే అధికంగా ఆధారపడి ఉంది. విశాఖలో ఈ మూడో వ్యూహాత్మక గేట్‌వే ఏర్పాటు కావడం దేశ డిజిటల్ భద్రతకు ఒక కవచంలాంటిది. ఇది ప్రకృతి వైపరీత్యాలు లేదా సాంకేతిక అంతరాయాల సమయంలో దేశవ్యాప్త కనెక్టివిటీకి భరోసా ఇస్తుంది. తూర్పు భారతదేశాన్ని, ఆగ్నేయాసియా దేశాలను ప్రపంచానికి అనుసంధానించే నూతన డిజిటల్ ద్వారంగా విశాఖ అవతరించబోతోంది.

**హరిత ఇంధన వసతులు:** ఒక నగరానికి సరిపడా విద్యుత్‌ను వినియోగించుకునే ఈ భారీ ప్రాజెక్టును పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులతో (సౌర, పవన విద్యుత్) నడపాలన్న నిర్ణయం అభినందనీయం. ఇది పర్యావరణ పరిరక్షణతో కూడిన ప్రగతికి ఒక ఉజ్వల ఉదాహరణ.

### ఫలించనున్న ఆశలు, ఆకాంక్షలు...

ఈ దార్శనికత ఫలితాలు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా యువతకు అపారమైన అవకాశాలను సృష్టించనున్నాయి. రాబోయే కొద్ది సంవత్సరాల్లో 1.8 లక్షలకు పైగా ఉద్యోగాలు, రాష్ట్ర GSDPకి ఏటా సుమారు రూ.10,518 కోట్ల అదనపు చేయూత అనేవి కేవలం గణాంకాలు కావు.. అవి లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపే వాస్తవాలు. ఒకప్పుడు ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు, దేశాలకు వలస వెళ్లిన ఆంధ్ర యువత, ఇకపై తమ సొంత గడ్డపైనే ప్రపంచ స్థాయి సంస్థలలో పనిచేసే రోజులు ఎంతో దూరంలోలేవు. రాజకీయాలను కాసేపు పక్కన పెడితే చంద్రబాబు అభివృద్ధి ప్రదాత అని, ఆయన సంపద సృష్టికర్త అని, ఆయన సృష్టించే సంపదతో లక్షలమంది యువతకు గౌరవప్రదమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆధునిక హైదరాబాద్ చరిత్ర చెబుతుంది. ఒకరిద్దరు నేతలు తప్ప ప్రతిపక్ష నేతలు సైతం అంగీకరించే వాస్తవం ఇది. విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు కేవలం ఒక ఒప్పందం కాదు, ప్రజా తీర్పునకు ప్రతిఫలంగా నాయకుడు నిలబెట్టుకున్న నమ్మకం. విశాఖలో గూగుల్ ఏర్పాటు రాబోయే దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్‌ను, భారతదేశాన్ని ప్రపంచ టెక్నాలజీలో అగ్రగామిగా నిలబెట్టే ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోవడం ఖాయం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్




### చేపల మాఫియాపై..
### కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన

జిల్లాలోని కండలేరు జలాశయంలో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 13న కలువాయి మండలంలోని దాచూరు గ్రామ గిరిజన మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు కలిసి నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కొందరు వ్యక్తులు మాఫియాగా ఏర్పడి, ఇతర జిల్లాల నుంచి కూడా కొంతమంది తీసుకువచ్చి ఈ జలాశయంలో అక్రమంగా చేపలవేట సాగిస్తూ యానాదుల పొట్టకొడుతున్నారని యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయానికి సంబంధించి 25 కాలనీల్లో సుమారు నాలుగు వందల మంది సభ్యత్వం కలిగి ఉన్నారని, వారంతా ఈ జలాశయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ ఆందోళనలో ఆ సంఘం జిల్లాశాఖ అధ్యక్షులు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు సిహెచ్ ఉష, యువజన నాయకుడు బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, జిల్లాకలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు.

### సుప్రీం సీజేఐపై దాడి పట్ల..
### ఎమ్మార్పీఎస్ నిరసన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి..చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఇటీవల ఓ న్యాయవాది చేసిన దాడియత్నం దారుణమంటూ ఈనెల 13న నెల్లూరు కలెక్టరేట్ వద్ద నెల్లూరుజిల్లా ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం నాయకులు అంబేద్కర్ మాదిగ, ఉదయకృష్ణ మాదిగ మాట్లాడుతూ, చీఫ్ జస్టిస్‌పై అనుచిత ప్రవర్తనకు పాల్పడడం ఘోరమని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చూడాలని వారు కోరారు. ఆమేరకు కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జిల్లా కలెక్టర్‌కి వారు వినతిపత్రం సమర్పించారు.


### జీతాల కోసం..
### పారిశుద్ధ్య సిబ్బంది నిరసన

తమకు ఆరునెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, పది నెలలుగా ఇపిఎఫ్‌లో సొమ్ము జమకావడం లేదని జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ఈనెల 13న నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలను ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఆసుపత్రుల పరిశుభ్రతకు పాటుపడుతున్న తమకు పూటగడవడమే కష్టంగా ఉందని, జిల్లా ఉన్నతాధికారులైనా తమ కష్టాలను గమనించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ నిరసనలో జిల్లాలోని పొదలకూరు, రాపూరు, వెంకటాచలం, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు తదితర ప్రాంతాల్లోని సిబ్బంది పాల్గొన్నారు.


### బెల్టు షాపులు తీసేయండంటూ..
### రోడ్డెక్కిన మహిళలు

ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న తమ కుటుంబాల్లో మద్యం మహమ్మారి చిచ్చుపెడుతోందని, బెల్టుషాపుల్లో మద్యం తాగి అనేకమంది తమ కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని కోవూరులో వైసీపీ ఆధ్వర్యంలో మహిళానాయకురాళ్ళు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. కోవూరు ఎక్సైజ్ సీఐతో వారు మాట్లాడుతూ, గ్రామాల్లో వీధివీధికి మద్యం బెల్టు షాపులు తయారవుతున్నాయని, వెంటనే వాటిని నిరోధించి నిరుపేద కూలీలు మద్యానికి బానిసలు కాకుండా చూడాలని కోరారు. నకిలీమద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. వైసీపీ మహిళా నాయకురాళ్ళు లక్ష్మీకుమారి, ప్రమీలమ్మ, జడ్పీటీసీ శ్రీలత, మాజీ సర్పంచ్ కె.ఉమ, జ్యోతి, కల్యాణి, రాజేశ్వరి, పర్వీన్ పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




కొడవలూరు మండలం, మానేగుంటపాడు గ్రామ వాస్తవ్యులు గునుపాటి శ్రీనివాసులురెడ్డి - కృష్ణవేణిల కుమార్తె **దేవిశ్రీ - ప్రసన్నరెడ్డి** (గూడూరు మండలం, చెన్నూరు గ్రామ వాస్తవ్యులు అల్లూరు కరుణాకర్‌రెడ్డి - సుప్రజల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 8న నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.




బాల సాహితీవేత్త, నెల్లూరు వాస్తవ్యులు తలుపూరు వెంకట రామకృష్ణ - శైలజల కుమారుడు **వెంకట సాయి స్వరూప్ - టి.కె.ఉషశ్రీ** (నెల్లూరు వాస్తవ్యులు టి.ఎల్.ఎన్. చౌదరి - శ్రీలక్ష్మిల కుమార్తె)ల పరిణయం ఈ నెల 8వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభ దీవెనెలు.

# ఏకాంబరేశ్వరునికి సోమిరెడ్డి, వేములపాటి పూజలు



వెంకటాచలం మండలం కంటే పల్లిలోని శ్రీ కామాక్షిదేవి సమేత ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నంది, నవగ్రహాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ టిడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. జనసేన నేత బోనుబోయిన ప్రసాద్, గ్రామస్తులు వారిని ఘనంగా స్వాగతించారు. అనంతరం, పడమటి గిరిజన కాలనీలో శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, తూర్పు గిరిజన కాలనీలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజలు, ఎస్సీ కాలనీలో శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# 'చెట్టు=తల్లి'..ఎడిటింగ్ పూర్తి!





నెల్లూరులోని శ్రీ కళాంజలి క్రియేషన్స్-లౌహిత్య సమర్పణలో షూటింగ్ జరుపుకుంటున్న 'చెట్టు=తల్లి' లఘుచిత్రం దాదాపు పూర్తికావచ్చింది. ప్రముఖ రచయిత-నటుడు కళాంజలి అనంత్ దర్శకత్వంలో నిర్మాణంలో ఉన్న ఈ సందేశాత్మక షార్ట్‌ఫిల్మ్‌కి నగరంలోని 'జయాస్ అద్భుత్ స్టూడియో'లో ఎడిటింగ్ జరుగుతోంది. మానవాళి మనుగడకు ప్రాణప్రదమైన చెట్లను కాపాడుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలనే ఇతివృత్తంతో ఈ లఘుచిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వృక్షో రక్షతి రక్షిత:' అన్నట్లుగా, చెట్లను రక్షిస్తే అవే మనల్ని రక్షిస్తాయని ఈ చిత్రం ద్వారా తెలియజేస్తూ, ప్రజల్లో చెట్ల సంరక్షణపై మరింత స్ఫూర్తిని కలిగించనున్నారు. చెట్ల ప్రాధాన్యతను వివరిస్తూ అత్యద్భుత సంభాషణలతో ఈ చిత్రం రూపొందిస్తున్నారు. ఇందులో నటీనటులు ధీరజ్, సుఫియా పర్వేజ్‌లు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ లఘు చిత్రానికి పాటలు మద్దూరి, సంగీత్ సౌరభ్ సంగీతం, కెమెరా-ఎడిటింగ్‌లు రాజేష్ నిర్వహిస్తున్నారు.

# శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్

## ● పారిశ్రామిక వసతుల పట్ల ప్రశంస



బెల్జియం పారిశ్రామిక ప్రయోజనాల చర్చల నిమిత్తం ముంబైలోని బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ఇక్కడ పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం గురించి వివరించారు. శ్రీసిటీ పరిసరాలను కాన్సుల్ జనరల్ సందర్శించి, శ్రీసిటీ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులకు ఇది అత్యంత అనువైన ప్రదేశమని వ్యాఖ్యానించారు. వెర్మీరిన్ సంస్థ అధునాతన వీల్‌చైర్లు తయారుచేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంసించారు. వెర్మీరిన్ సంస్థకు శ్రీసిటీ మద్దతును అభినందిస్తూ, మరిన్ని బెల్జియన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీసిటీ-డానియెలి పరిశ్రమకు అవార్డులు




క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ నిర్వహించిన "చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ (సీసీక్యూసీ)" పోటీలలో అత్యున్నత నాణ్యత, ఉత్తమ పనితీరుకు శ్రీసిటీ లోని డానియెలి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్ అవార్డులు, ఒక సిల్వర్ అవార్డును గెలుచుకుంది. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకు డానియెలి కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) పి.శ్రీనివాసరావుకు "ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు" ప్రదానం చేశారు. ఆయన ప్రతిభ, దార్శనికత, పటిష్ట నాయకత్వ లక్షణాలకు ఆ అవార్డు దక్కింది. ఇది శ్రీసిటీకి గర్వకారణమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, డానియెలి యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో..

# 'సూపర్ జీఎస్టీ - సూపర్ ఆదా'



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం అక్టోబర్ 16వ తేదీ గురువారం నాడు జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరిగింది. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించిన సమాచారంతో కూడిన ఫ్లెక్సీలను, వాల్‌పోస్టర్‌లను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఉప రవాణాశాఖ అధికారి చందర్, జిల్లా జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్ తదితరులు ఆవిష్కరించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర నియోజకవర్గంలోని ఎంజి మాల్‌లో తొలుత ప్రారంభించి, అనంతరం వాహన ర్యాలీని నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో మినీబైపాస్ వద్ద ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద, బుచ్చిరెడ్డిపాళెంలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్ నందు, కావలి నియోజకవర్గంలోని ఉదయగిరి బ్రిడ్జ్ సెంటర్ వద్ద, ఉదయగిరి నియోజకవర్గంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఆత్మకూరు నియోజకవర్గంలోని నెల్లూరుపాళెం వద్ద, కందుకూరు నియోజకవర్గంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి జీఎస్టీ తగ్గింపు వల్ల రవాణాశాఖకు సంబంధించి కలిగే లాభాలను వివరించారు. కొత్తగా వాహనం కొనదలచిన వారికి 8వేల రూపాయల నుండి 2 లక్షల రూపాయల వరకు ఆదా సమకూరుతుందని అధికారులు వివరించారు. జీఎస్టీ-2.0వల్ల థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ కూడా 12శాతం నుండి 5శాతానికి తగ్గడం గమనార్హం. సర్వేపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి పాల్గొని జీఎస్టీ ప్రాధాన్యతను, కొత్త జీఎస్టీ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఇతర అన్ని నియోజకవర్గాలలో స్థానిక కూటమి నాయకులు, రవాణా అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆయా ప్రాంత ప్రజలు విశేషంగా పాల్గొని ఈ కార్యక్రమాలన్నింటినీ జయప్రదం చేశారు.

# ఎన్టీఆర్ వైద్యసేవలను కొనసాగించాలి

## ● సీపీఐ నేత అరిగెల సాయి

ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపి వేయాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ నిర్ణయించడం బాధాకరమని, పేద ప్రజలకు ఎన్టీఆర్ వైద్యసేవలను వెంటనే అందించాలని సీపీఐ(భారత కమ్యూనిస్టు పార్టీ) జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఒక ప్రకటనలో కోరారు. పేదల సంజీవని 'ఎన్టీఆర్ వైద్య సేవల పథకం' ఆగితే పేదలకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు గాల్లో కలిసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ సకాలంలో చేసుకునేందుకు తగు ఆర్థిక వనరులు లేక బాధలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసేవరకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఎన్టీఆర్ వైద్యసేవలను యధాతథంగా కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌కి.. వింజమూరు విద్యార్థి



జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో వింజమూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రథమంగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ మాలకొండయ్య తెలిపారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నెల్లూరుజిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.వై.ఆర్ జోసఫ్ ఇన్‌స్ట్రుమెంటల్ పర్కసివ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి, సర్టిఫికెట్, మెమెంటో పొందాడని తెలిపారు. అక్టోబర్ 23,24 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌లో ఆ విద్యార్థి పాల్గొంటు న్నాడని అంటూ, ఆ విద్యార్థిని, గైడ్ టీచర్లను అభినందించారు.




## కీళ్ళ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

### అపోలో వైద్యుల సూచన

కీళ్ళ సమస్యలు (ఆర్థరైటిస్) ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, వాటిని నిర్లక్ష్యం చేయ కూడదని నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యులు సూచించారు. ఈనెల 12న ప్రపంచ ఆర్థరైటిస్ డేని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్స్ డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ విక్రమ్‌రెడ్డిలు పాల్గొన్నారు. కీళ్ల సమస్యల్లో దాదాపు 200 రకాల కంటే ఎక్కువ వ్యాధులే ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకోకుంటే అవి కేవలం కీళ్లకే పరిమితం కాకుండా శరీరంలోని చాలా వ్యవస్థలను దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్, హైబీపి, క్యాన్సర్ లాంటి జబ్బుల కంటే ఆర్థరైటిస్ సమస్య తీవ్రత చాలా మందిలో ఎక్కువగా ఉంటోందని నెల్లూరు 6వనగర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా అపోలోలో తక్కువ ఫీజులతో అందించే స్క్రీనింగ్ పరీక్షల బ్రోచర్‌ను వైద్యులతో కలసి డాక్టర్ శ్రీరామ్ సతీష్ ఆవిష్కరించారు. తొలుత, నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద నుండి అపోలో ఆసుపత్రి వరకూ జరిగిన వాకథాన్‌లో అపోలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇఎస్ఐ పథకం పట్ల అవగాహన

నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలో ఉన్న శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలులో ఈనెల 14న ఇఎస్ఐ (ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సురెన్సు) పథకం పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. ఇఎస్ఐ డిప్యూటి డైరెక్టర్ డిఎస్ఎస్ దత్తాత్రేయ (రీజనల్ కార్యాలయం–విజయవాడ) ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లూరుజిల్లాలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు ఆ పథకం పట్ల అవగాహన కలిగించారు. ఇఎస్ఐలో ఇప్పటివరకు చేరనివారు ఎస్‌పిఆర్ఇఇ–2025 కార్యక్రమం ద్వారా ఈ ఏడాది డిసెంబరు 25లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఇఎస్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ కోలా రాము, ఇఎస్ఐ మేనేజర్ శివాజీతో పాటు, అపస్మా



(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి నేతాజీ సుబ్బారెడ్డి, వై. వెంకట్రామయ్య, వెంకటాద్రి, శ్రీనివాసరావు తదితర కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## ఆనంద దీపావళి



కృతయుగం నుంచి కలియుగం వరకు సంభవించిన అనేకానేక సంఘటనల సంస్మరణమే దీపావళి. బలి చక్రవర్తి, విష్ణువుచే పాతాళానికి అణగదొక్కబడ్డ రోజు, శ్రీరాముడు పట్టాభిషిక్తుడయిన రోజు, విక్రమ శకానికి కారణమైన విక్రమార్క చక్రవర్తి పట్టాభిషేకం జరిగిన రోజు, జైన మత స్థాపకుడు మహావీరుడు మహాపరి నిర్వాణం చెందిన రోజు దీపావళి. హిందూ ధర్మానికి, సాంప్రదాయానికి దీపావళి ఒక చిహ్నం. అయితే, శ్రీకృష్ణుడు సత్యభామా సమేతంగా నరకుని సంహరించిన రోజు నరక చతుర్ధశి, తరువాతి రోజు దీపావళిగా అధిక ప్రచారంలో ఉంది.

కృతయుగంలో జ్ఞాన దీపావళి, త్రేతాయుగంలో యజ్ఞ దీపావళి, ద్వాపరంలో ధర్మ దీపావళి, కలియుగంలో ప్రజానంద, ఆరోగ్య, కర్మ దీపావళి అని దీపావళి పరిణామక్రమాన్ని పరిశోధకులు వివరిస్తూ ఉన్నారు.

క్రీ.పూ. 400 ఏళ్ల నాటి వాడైన వాత్స్యాయనుడు తన కామసూత్ర గ్రంథంలో 'యక్షరాత్రి' పేరున దీపావళిని కార్తీక అమావాస్యనాడు పాటించే వారని రాశాడు. దీన్నే 'సుఖరాత్రి' అనేవారట. జూద క్రీడలు, వినోదాలు, మద్యపానం, విందు భోజనాలు, ఆటపాటలు, దీపాలంకరణలు విరివిగా జరిగేవని ఆయన పేర్కొన్నాడు.

శ్రీహర్షుడి నాగానందంలో (క్రీ.శ. 606–648) దీపావళి ప్రస్తావన ఉంది. కాశ్మీర దేశపు నీలమత పురాణం (క్రీ.శ. 500–800)లో కూడా దీపావళిని కార్తీక అమావాస్య నాడు చేసేవారని వర్ణనలున్నాయి. సోమదేవ సూరి తన 'యక్షతిలక' అనే చంపూ రచనలో మహర్నవమి మరునాడు దీపావళి జరిగేదని పేర్కొన్నాడు.

క్రీ.శ. 1030 నాటి శ్రీపతి పండితుడు 'జ్యోతిష రత్నమాల'లోను, అల్‌బెరూనీ తన 'తహ్‌కిక్–ఇ–హింద్'లోను, గుజరాతీ పండితుడు (1080–1172) హేమ్‌చంద్ 'దేశ్ రత్నమాల' గ్రంథంలోను, అబ్దుల్ రహమాన్, సంతోష్ జ్ఞానేశ్వర్ (1290), నికొలాయ్ కాంటే(1420), అబ్దుల్ ఫజల్ (1590) దీపావళి గురించి తమ రచనల్లో వర్ణించారు.

హిందూ ధర్మంలో సంక్రాంతి, ఉగాది ప్రకృతి పండుగలు. దసరా, దీపావళి స్త్రీ దేవతలకు సంబంధించిన పండుగలు. అంటే స్త్రీ దేవతలు అసురులను సంహరించినవి.

మహారాష్ట్రలో ఇది 5 రోజుల పండుగ. తొలినాడు చతుర్దశి, రెండవ రోజు దీపావళి, మూడవరోజు 'పెధిపూజన్'. లక్ష్మీ సరస్వతులను పూజిస్తారు. నాలుగవరోజు కార్తీక శుద్ధ పాడ్యమి. దీన్ని 'బలిప్రతిపత్' అంటారు. ఐదవనాడు 'భాయిదూజ్' పండగ. యముడు తన చెల్లెలు యమున యింటికి వెళ్లి భోంచేసిన రోజు. ఈ సందర్భంలో సోదరులు, సోదరీలకు బహుమతు లిస్తారు. సోదరీలు సోదరులకు ధోవతులిస్తారు. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని పెంపొందించే రోజుగా దీనిని పరిగణిస్తారు.

ఇకపోతే, దీపావళి ప్రత్యేకత బాణాసంచా. మరొక విశిష్టత లక్ష్మీపూజ. గుజరాతీయులు, మార్వాడీలు గొప్పగా చేస్తారు. తమిళులు, ఆంధ్రులు లక్ష్మీపూజను ఘనంగా చేస్తుంటారు. లక్ష్మీదేవి దీపావళి రోజున భూలోకానికి వచ్చి ఇల్లిల్లు తిరుగుతుందని నమ్మకం. శుభ్రంగా ఉన్న ఇళ్లల్లో తన కళను ఉంచి పోతుందని విశ్వాసం.

దీపావళి నాటి రాత్రి భోజనాలయ్యాక మైనపువత్తులు కాల్చి అవి మండుతూ వుంటే వాటిమీద గుగ్గిలం పొడి చల్లేవారు. ఆ గుగ్గిలం భగ్గుమనేది. ఎంత బాగా భగ్గుమంటే ఆ ఏడు వారికంత జయప్రదంగా ఉంటుందని నమ్మకం. అందుకనే 'అగ్గిమీద గుగ్గిలం' అనే సామెత తెలుగునాట ప్రసిద్ధమైంది.

పూర్వ మహారాజులు కాలినడకన నగరం అంతా తిరుగుతూ దీపాలంకారాన్ని వీక్షించేవారు. ఆయనలా వెళ్లగానే ఆడవారంతా, చేటలను, గంటలను, తప్పెటలను వాయిస్తూ లక్ష్మీదేవి అక్కగారయిన జ్యేష్టాదేవిని అంటే దరిద్రదేవతను ఊరి నుంచి తరిమివేయడానికి పెద్ద కోలాహలం చేస్తూ వీధులన్నీ తిరిగేవారు. కొన్ని పల్లెల్లో ఇప్పటికీ ఈ ఆచారం ఉంది. రాత్రి భోజనాలయ్యాక స్త్రీలు చేటల్ని, గంటల్ని ఒక్కసారి దులిపి కొడతారు.

ఏది ఏమయినా దీపావళి భారతీయులకు అత్యంతప్రియమైన పండుగ. అయితే, బాణాసంచా విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ప్రమోదాలు ప్రమాదాలకు దారి తీయకూడదు. భేషజాలకు పోయి ఎక్కువ ధనాన్ని బాణసంచాకు తగలెయ్యడం తగదు. లక్ష్మీదేవి పూజ చేసి అమ్మవారి అనుగ్రహం పొందడం అందరికీ ఈ దీపావళి నాడు శుభప్రదం.

**– డా. గంగిశెట్టి శివకుమార్, సెల్: 94418 95343**

## టూకీగా...



### ఆత్మకూరులో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఆత్మకూరు మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఈనెల 13న జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకురాలు దేవసేనమ్మ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించి, సరైన పత్రాలు లేని సుమారు రూ.34వేలు విలువచేసే పురుగుమందులను నిలుపుదల చేశారు. తనిఖీల్లో ఎంఏఓ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

### పెరమన వద్ద వాహనదారులకు సూచనలు

సంగం మండలం పెరమన గ్రామం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై తరచూ రోడ్డుప్రమాదాలు జరుగుతుం డడంతో ఆ ప్రాంతాన్ని 'బ్లాక్‌స్పాట్'గా గుర్తించి, సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో అక్కడ ఈనెల 13న వాహనదారులకు అవగాహన కలిగించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు పెట్టుకోవాలని చెప్పారు. ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

### మోర్లవారిపాళెంలో పోషణ మాసోత్సవాలు

కావలి రూరల్ మండలం పరిధిలోని మోర్లవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 13న సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలోని తల్లీబిడ్డలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు 'బాలామృతం' తినిపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.

### సంగంలో టపాసుల దుకాణాల పరిశీలన

దీపావళిని పురస్కరించుకుని మండల కేంద్రమైన సంగంలో ఈనెల 13న ఎస్ఐ రాజేష్ టపాసుల దుకాణాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జనావాసాల మధ్య టపాసులు నిల్వ చేయకూడదని చెప్పారు. దుకాణాల వారు తప్పనిసరిగా లైసెన్సులు పొంది ఉండాలని, నిబంధనలు పాటించని దుకా ణాల యజమానులపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

### నార్త్‌రాజుపాళెంలో అగ్నిప్రమాద బాధితులకు సాయం

కొడవలూరు మండలం నార్త్ రాజుపాళెం పంచాయతీలోని వినాయక కాలనీలో గిరిజనుల ఇళ్ళు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై సర్వస్వం కోల్పోయిన నాలుగు కుటుంబాల వారికి ఐటీడీఏ ఏపీఓ మల్లికార్జునరెడ్డి ఆదేశాలతో సాయం అందించారు. ఏపీఓ దేవరకొండ కృష్ణ, ఎఫ్ఓ శ్రీనివాసులు, దాసరి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు పట్టణంలో ఈనెల 13న అసిస్టెంట్ కార్మికశాఖ అధికారి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ జరిగింది. మునిసిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వ ర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకెంతో మేలు కలుగుతోందని వారు చెప్పారు. షోరూమ్‌ల వారు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

### ముసునూరు వద్ద.. రైల్లోంచి జారిపడి యువకుని మృతి

కావలి రైల్వేస్టేషన్ పరిధిలోని ముసునూరులో ఈనెల 13న ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులోంచి ఓ గుర్తుతెలియని యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. తీవ్ర గాయాలతో రైలుపట్టాలపై పడివున్న ఆ వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రైల్వే ఎస్ఐ కెవెంకట్రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

### ఏపూరులో పశువైద్య శిబిరం

రాపూరు మండలం ఏపూరు గ్రామంలో ఈనెల 13న నెల్లూరులోని రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరు డివిజన్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, రాపూరు ఏ.డీ అనిల్‌కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివకుమార్ పాల్గొని పాడిపశువుల పెంపకం పట్ల రైతులకు అవగాహన కలిగించారు.

### దుత్తలూరు మండల సమావేశం..17న

దుత్తలూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన జరుగుతుందని, మండల అధికారులు, ప్రజాప్రతినిదులు అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీఓ కార్యాలయం వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆదర్శంగా నిలుస్తున్న 'ఆనం'

## • కాలు కోల్పోయిన విద్యార్థికి కైవల్య సాయం



ఒక విద్యార్థి భవిష్యత్తుకు సంబంధించి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మానవతా హృదయంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. కొద్ది నెలల క్రితం ఆత్మకూరులో ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్ళిన సందర్భంగా ఆయన్ను బొమ్మిరెడ్డి బాలు అనే విద్యార్థి కలిశాడు. ప్రమాదవశాత్తూ తన కుడికాలు కోల్పోవడం జరిగిందని, కృత్రిమ కాలు ఏర్పాటుకు సాయం అందించాలని అభ్యర్థించాడు. మంత్రి ఆనం చలించిపోయి, ఆ విద్యార్థిని వెంటనే పీ-4పథకం కింద దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించి, ఆ విద్యార్థికి అవసరమైన సదుపాయాలు కలిగించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం నాడు ఆనం కుమార్తె ఆనం లీలా కైవల్యారెడ్డి బండారు పల్లి గ్రామానికి చెందిన ఆ విద్యార్థి కుటుంబాన్ని దత్తత తీసుకునే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మునిసిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బి. పావని, మునిసిపల్ ఛైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, కమిషనర్ గంగాప్రసాద్, పలు పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో దత్తత కార్య క్రమం జరిగింది. అనంతరం, కైవల్యారెడ్డి మాట్లాడుతూ, ఆ విద్యార్థి యోగక్షేమాలు చూసుకుంటామని తమ నాన్నగారు ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారని, నాన్నగారి సూచనలతో ఆ కుటుం బాన్ని ఇప్పుడు దత్తత తీసుకున్నామని తెలిపారు. ఆ విద్యార్థికి త్వరలోనే జైపూర్ కాలు (కృత్రిమ కాలు)ను అమర్చేందుకు కూడా ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతేకాక, ఆ విద్యార్థికి కళాశాలలో చదువు పూర్తయ్యేంత వరకు ఫీజులు పూర్తిగా తామే చెల్లిస్తామని చెప్తూ, ఈ సందర్భంగా మెస్ ఫీజులకు సంబంధించిన చెక్కును ఆమె ఆ విద్యార్థికి అందజేశారు. 'ఆనం వారు చెప్పింది చేస్తారు.. చేసేదే చెప్తారు' అని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు ప్రశంసించడం గమనార్హం.











Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com